

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## ఫలించిన ఎంపీ వేమిరెడ్డి కృషి

### నెల్లూరు మెడికల్ కాలేజీలో పీజీ సీట్ల కేటాయింపు
### హర్షం వ్యక్తం చేస్తున్న మెడికల్ కళాశాల యాజమాన్యం
### ధన్యవాదాలు తెలియజేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు



**నెల్లూరు రూరల్, నవంబర్ 26, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి ఫలించింది. జిల్లాకు ఎంతో ప్రతిష్టాత్మకమైన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి 5 కొత్త సీట్లు కేటాయిస్తూ కేంద్ర వైద్యారోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు నెల్లూరు మెడికల్ కళాశాలకు సమాచారం అందించింది. నెల్లూరు మెడికల్ కళాశాలలో 2024 - 25 సంవత్సరానికి సంబంధించి కాలేజీలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీకి సంబంధించి పీజీ సీట్లు కేటాయించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆగస్టు 29వ తేదీన నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ బి.ఎన్ గంగాధర్‌ని ఢిల్లీలో కలిసి వివరించారు. అదేవిధంగా కేంద్రమంత్రి కలిసి పీజీ సీట్ల కేటాయింపుపై చర్చించారు. అందులోభాగంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి మేరకు ఆసుపత్రిలో పర్యటించిన ఎన్‌ఎంసీ సభ్యులు కళాశాలలో పరిశీలించి సీట్ల కేటాయింపు చేపట్టారు. జనరల్ సర్జరీకి సంబంధించి 5 సీట్లను కేటాయించింది. సీట్ల కేటాయించడం ద్వారా యువ డాక్టర్లకు సీట్లు అందుబాటులోకి వచ్చి పేదలకు మంచి వైద్యం అందనుంది. ఈ నేపథ్యంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. నాగరాజమన్నార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సిద్ధా నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్స్ డా.మస్తాన్ భాష, డా.నరేంద్ర, ఇతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం చేస్తున్నారు. సీట్లు సాధించడంలో ప్రత్యేక కృషి చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా వైద్యశాల, మెడికల్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీని కొనియాడుతున్నారు.

## విధుల్లో కార్మికులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోండి
### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 26, ప్రభాతవార్త:** భారీ వర్షాల నేపథ్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు వాతావరణానికి తగ్గట్టుగా తగిన రక్షణ చర్యలను తీసుకోవాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ లో భాగంగా మంగళవారం స్థానిక పొదలకూరు రోడ్డు, డైకస్ రోడ్డు, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లోని మస్టర్ పాయింట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులతో కమిషనర్ మాట్లాడుతూ కార్మికులంతా రెయిన్ కోట్లు, విజబుల్ జాకెట్లు ధరించి విధులు నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులంతా తప్పనిసరిగా చేతి గ్లౌస్ లను వినియోగించాలని, తగిన రక్షణ ఉపకరణాల సాయంతో పనుల్లో పాల్గొనాలని సూచించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఉంటే ఆరోగ్య శాఖ అధికారి లేదా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని సుపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులకు సూచించారు. స్థానికంగా ఉన్న టీ స్టాళ్లు ఇతర దుకాణాలు తప్పనిసరిగా చెత్తబుట్టలను వాడుకలో ఉంచి, వినియోగదారులు అవి వాడేలా సూచికలు ఏర్పాటు చేయాలని దుకాణదారులను హెచ్చరించారు. అనంతరం మాగుంట లేఔట్, రామలింగాపురం, విజయ మహల్ గేట్ అండర్ బ్రిడ్జిలను పరిశీలించి అక్కడి వాటర్ పంపింగ్ మోటార్ల పనితీరును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, శానిటేషన్ సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని సత్కరించిన టీడీపీ నాయకులు



**లింగసముద్రం, నవంబర్ 26, ప్రభాతవార్త** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ను విశ్వనాధపురం గ్రామ సర్పంచ్ బొల్లినేని నాగేశ్వరరావు, యర్రా రెడ్డిపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు రాజారపు మాలకొండయ్య, చినపవని టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్ శాలువాతో సత్కరించారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 26, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది రాజ్యాంగబద్ధంగా నడవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగానికి లోబడి ప్రతి ఒక్కరూ పనిచేస్తూ దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. రాజ్యాంగ పరిరక్షణలో పోలీస్ శాఖ పాత్ర ముఖ్యమైనదని, పోలీసులు సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, పౌరుల ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో బాధ్యతాయుతమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే మన రాజ్యాంగం అతి పెద్దదని, భారతీయ జీవన గమనాన్ని ప్రతిబింబించే విలువైన సాధనమని, భారత రాజ్యాంగ అధికరణలు, సూత్రాలు, మార్గదర్శకాలను అందరూ మరింతగా ప్రజలలోకి తీసుకెళ్ళి, భారత దేశంలో ప్రజాస్వామ్య ఫలాలు ప్రజలందరికీ చేరడానికి కృషి చేయాలని, రాజ్యాంగంలోని ప్రతి అక్షరం అందరికీ శిరోధార్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యస్.పితో పాటు అడిషనల్ యస్.పి. ముని రాజ, ఎస్బి సీఐ వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ రాజారావు, హోంగార్డ్స్ ఆర్ఐ పాల్ రాజ్, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## స్మశాన వాటికను పరివేక్షించండి



**విడవలూరు, నవంబర్ 26, ప్రభాతవార్త:** మండలం ఊటుకూరు గ్రామంలో ముస్లింల స్మశాన వాటికను ఆక్రమణకు గురవుతుందని రాష్ట్ర వక్స్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. స్మశాన వాటికను ఆక్రమణకు పాల్పడుతున్న వారికి ఒక వర్గానికి చెందిన నాయకులు మద్దతిస్తూ సహరిస్తున్నారని వాపోయారు. స్మశాన స్థలాన్ని పర్యవేక్షించి ముస్లింల స్మశాన వాటికను కాపాడాలని కోరడంతో స్పందించిన అబ్దుల్ అజీజ్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబర్26, ప్రభాత వార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 4950 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో70.58టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 400, ఎన్ఎ ఫ్ సికి 400, పెన్నా డెల్టాకు 50, కండలేరు వరద కాలువకు4600 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.565మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం
### ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి




**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 26, ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటూ, సమిష్టిగా కృషి చేస్తామని రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలియజేశారు. నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్ లకు సంబంధించి అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పై కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, ఇతర అధికారులతో రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో ఇంటిపన్నులను బలవంతంగా వసూలు చేయొద్దని సూచించారు. బకాయిదారులకు నిర్దేశిత సమయం కేటాయించి వీలుంటే వాయిదాల పద్దతిలో పన్నులు వసూలు చేయాలని సూచించారు. నెల్లూరు నగర కార్పొరేషన్ లో మున్సిపల్ యాక్ట్ అమలులో ఉండేలా అన్ని విభాగాల అధికారులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆరోగ్య శాఖ ద్వారా జనన మరణ ధ్రువీకరణ పత్రాలను వేగవంతంగా ఇవ్వాలని సూచించారు. రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులతో మానవత్వంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్ లలో 1260 వీధి లైట్ల అవసరముందని, అన్ని ప్రాంతాల్లో త్వరగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్పొరేషన్ విలీన్ గ్రామాలలో పందులు, కోతుల సమస్య అధికంగా ఉందని, త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. నెల్లూరు రూరల్ కు సంబందించి అభివృద్ది పనులపై, ప్రజా సమస్యలపై నెలకు ఒకసారి సమీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## ఉపాధిలో అవినీతికి పాల్పడితే జైలుకే..

### రూ. లక్ష కంటే ఎక్కువ నిర్ధారణ అయితే ఎఫ్ఐఆర్
### జీఓ నెం. 52కు పదును పెడుతున్న విజిలెన్స్ విభాగం
### గత అవినీతి వివరాలు పంపాలని జిల్లా అధికారులకు లేఖ



**నెల్లూరు అర్బన్, నవంబర్ 26, ప్రభాతవార్త** ఉపాధి హామీ పథకంలో అవినీతిని అరికట్టాలని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ స్కీమ్లో కీలకమైన విజిలెన్స్ విభాగం గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం కావడంతో దానికి జవసత్వాలు నింపాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిబ్బందిలో జవాబుదారీతనం పెంచే ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా పోలీసు అధికారిని నియమించారు. కొత్తగా వచ్చిన చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీ హర్ష నిఘా విభాగాన్ని తిరిగి క్రియాశీలం చేసేందుకు చర్యలు ప్రారంభించారు. విజిలెన్స్ విభాగం అసలు లక్ష్యాలను సాధించేందుకు ఉన్న అధికారాలను వినియోగించాలని నిర్ణయించారు. ఉపాధి పథకంలో సోషల్ ఆడిట్ విభాగం తనిఖీలు చేపడితే రికవరీ వసూలు చేసే అతి స్వల్ప పాత్ర మాత్రమే పోషిస్తున్న విజిలెన్స్ విభాగం అసలు విధులను అమలులోకి తీసుకోవాలని యోచిస్తున్నారు. విజిలెన్స్ విభాగం ఆవిర్భావం సమయంలో తెచ్చిన ఉత్తర్వులన్నింటినీ సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా భారీగా అవినీతికి పాల్పడిన సిబ్బందిపై రాష్ట్రంలో ఎక్కడా కేసులు నమోదు చేసిన దాఖలాల్లేవని అంటున్నారు. జీఓ నెం.52 ప్రకారం ఉపాధి హామీ పథకంలో రూ.లక్ష కంటే అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్లో నిర్ధారణ అయితే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేయాలని పేర్కొన్నారు. ఆ జీఓను ఇప్పటి వరకు అమలు చేయ కపోవడంతో, చీఫ్ విజిలెన్స్ అధికారి దానిపై దృష్టి పెట్టారు. ఆయనకు గతంలో విజిలెన్స్ ఏసీబీ తదితర విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉండటంతో తప్పు జరిగిన తీరు, దానికి కారణాలను అన్వేషించి అక్రమార్కులపై కేసులు నమోదు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మార్గదర్శకాల కచ్చిత అమలుతో అవినీతి కట్టడి రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎంత మంది రూ. లక్ష కంటే ఎక్కువ అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్ నిర్ధారించింది? వారిలో ఎంత మందిపై ఎస్ఐఆర్ నమోదు చేశారు? ఎంత మందిపై ఇప్పటి వరకు కేసులు నమోదు చేయ లేదు! అందుకు కారణాలేంటి? అనే తదితర వివరాలను అందించాలని అన్ని జిల్లాల విజిలెన్స్ అధికారులకు లేఖలు రాశారు. అదేవిధంగా ఇప్పటి వరకు ఆర్ఆర్ యాక్ట్ ఎన్ని చోట్ల వినియోగించారు? పరారీలో ఉన్న అక్రమార్కులకు సంబంధించిన వివరాలు, తొలగించిన సిబ్బంది వివరాలను కూడా పంపించాలని ఆదేశించారు. దీంతో తప్పుచేసిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. విజిలెన్స్ మార్గదర్శకాలను కచ్చి తంగా అమలు చేయడం ద్వారా అవినీతిని పూర్తిస్థాయిలో నిర్మూలించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. సోషల్ ఆడిట్ తేల్చిన తప్పులపై మూడు రోజుల్లోపు చర్యలు తీసుకోవాలని జీఓ నెం.52లో ఉంది. అయితే నెలల తరబడి అవినీతిపరులపై చర్యలు తీసుకోవడం లేదని విజిలెన్స్ అధికారుల పరిశీలనలో తేలింది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ప్రొసీడింగ్స్‌ను కచ్చితంగా అమలు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. కంచే చేను మేసినట్లుగా అక్రమార్కుల భరతం పట్టాల్సిన సోషల్ ఆడిట్ విభాగం కొన్ని చోట్ల కమీషన్లు వసూలు చేయడంపైనా దృష్టి పెట్టారు. ఈ విభాగాన్ని గాడిలో పెట్టాలని భావిస్తున్నారు. దీంతో పాటు అంబుడ్స్మన్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలకు కూడా పదును పెట్టే యోచనలో గ్రామీణాభివృద్ధి శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. కేసులు నమోదు చేయడం ద్వారా ఉపాధి పథకంలో అవినీతికి పాల్పడితే జైలుకెళ్లక తప్పదన్న భయం కల్పించాలని యోచిస్తుంది.

## ప్రజలకు పరిపాలన మరింత చేరువ కావాలి : ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**ఉలవపాడు, నవంబర్ 26, ప్రభాతవార్త** నూతన ఒరవడితో ప్రభుత్వాన్ని నడిపి, ప్రజలకు పరిపాలన మరింత చేరువ కావాలని, ద్వేష జాలులేని సమాజాన్ని నిర్మించాలని, వెనుకబడిన ఆంధ్రప్రదేశ్‌ను ముందు వరుసలో ఉంచాలనే ఆలోచనలతో ముఖ్య ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిపాలన సాగిస్తున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ ఎన్.విజయ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చేయాలని ఆయన అధికారులను సూచించారు. అధికారులతో మండల స్థాయిలో, పంచాయతీల్లో ఉన్న నిధుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీటి నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మొదలు పెట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చూడాలని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన చోట నూతన సీసీ రోడ్లు, కాలువలు, స్మశాన వాటికల అభివృద్ధి అంచనాల తయారు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అర్హులైన లబ్దిదారులకు అందేలా చేసే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పంచాయతీలో ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. సొంత స్థలం కలిగి ఇల్లు లేని ప్రజలు పీఎంఏవై స్కీం ద్వారా మీ యొక్క గ్రామ సచివాలయం నందు పేరు నమోదు చేయించుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. అనంతరం మండల కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆ తదుపరి ఉలవపాడు సీహెచ్‌సీ హాస్పిటల్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు కాలం కావున ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో లావణ్య, ఉలవపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు అనుబంధ సంఘాల అధ్యక్షులు బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పాటూరులో చేనేత క్లస్టర్‌కు నిధులు మంజూరు చేయండి
### జౌళి శాఖ మంత్రిని కోరిన వేమిరెడ్డి
### వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



**కోవూరు, నవంబం26 ప్రభాతవార్త :** నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కోవూరు నియోజకవర్గంలో ఉన్న పాటూరులో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర మంత్రి చాంబర్‌లో మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద ఐదు కొత్త స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను చేనేత అభివృద్ధి కమిషనర్‌కు సమర్పించడం జరిగిందని, అందులో పాటూరు కూడా ఒకటని వివరించారు. పాటూరు గ్రామంలో 500 చేనేత కుటుంబాలు పూర్తిగా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని మంత్రికి తెలియజేశారు. దీంతో ఇక్కడ ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఈ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అంచనా వ్యయం 76.320 లక్షలు అని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రామ్ ప్రతిపాదనను అంగీకరించి మొదటి విడత నిధుల మంజూరుకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి ప్రతిపాదనను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఇంటింటి సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించండి : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 26, ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అన్ని సంక్షేమ పథకాలు నగరపాలక సంస్థ వార్డు సచివాలయాల అన్ని పౌర సేవలు, ఇసుక బుకింగ్ చేసుకొనుటకు తదితర అన్ని సేవలను పొందేందుకు ఇంటింటి సర్వే తప్పనిసరి అని, సర్వే నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులకు ప్రతి ఒక్కరు సహకరించాలని కమిషనర్ సూర్య తేజ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజలంతా హౌస్ హోల్డ్ సర్వేలో తమ ఇంటిని మ్యాపింగ్ చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ఇప్పటివరకు 65 శాతం హైస్ హోల్డ్ మ్యాపింగ్ జరిగిందని మిగిలిన 35 శాతం కూడా పూర్తయ్యేలా ప్రజలంతా సహకరించాలని కమిషనర్ ఆకాంక్షించారు.

## సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 26, ప్రభాతవార్త :** సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల నిర్వహకులు నెల్లూరు నగరపాలక సంస్థ సూచించిన అన్ని నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల నిర్వాహకులకు వ్యర్థాల సేకరణ, రవాణా, విడుదలకు అనుమతులను మంజూరు చేస్తూ లైసెన్సులను కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల ద్వారా సేకరించిన వ్యర్థాలను స్థానిక అల్లీపురం, హరనాధపురం, వెంకటేశ్వరపురం ప్రాంతాలలోని మురుగు నీటి శుద్ధి కేంద్రాలలో మాత్రమే విడుదల చేయాలని ఆదేశించారు. ఆరుబయట పంట కాలువలు, నిర్జన ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలను విడుదల చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెప్టిక్ క్లీనింగ్ అవసరమైన పౌరులు 14420 నెంబర్ కు ఫోన్ చేసి వాహనాన్ని ముందుగా బుక్ చేసుకోవాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ.రామ్మోహన్ రావు ఈ.ఈ.లు రహంతు జానీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## డికేలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**నెల్లూరు,నవంబరు26 ప్రభాతవార్త-విద్య** : నగరంలోని స్థానిక డికే జూనియర్ కళాశాలలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా డికే కళాశాల ప్రిన్సిపాల్, ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా పాల్గొని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర, రాజ్యాంగ దేశంగా మన దేశాన్ని తీర్చి దిద్దేందుకు అందరూ కృషిచేయ్యాలన్నారు. జిల్లా యూత్ అధికారి మహేందర్‌రెడ్డి మాట్లాడుతు దేశానికి ఉన్నతమైన రాజ్యాంగాన్ని అందించి అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజ్యాంగ విలువలను అందరూ కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, కరుణకుమారి, ప్రసన్న, భారతి, వెంకట్రావు, సమత, కృష్ణవేణి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలపై విద్యార్థులలో అవగాహన పెరగాలి



**కలువాయి నవంబర్ 26 ప్రభాతవార్త** : కలువాయి మండలంలోని తెలుగురాయిపురం ( ఎస్‌సి) పాఠశాల నందు రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జి.వి మురళీకృష్ణా మాట్లాడుతు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలపై విద్యార్థులలో అవగాహన పెంపొందించి సమాజం పట్ల వారిలో సేవానిరతిని పెంపొందించి దేశ పురోగతికి ప్రతి ఒక్కరు తోడ్పడాలని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత గాధలు మరియు రాజ్యాంగ నిర్మాతగా దేశానికి చేసిన సేవలను గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. మనదేశ రాజ్యాంగ పీఠికను విద్యార్థుల చే ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.వి మురళీ కృష్ణా, ఉపాధ్యాయులు ఆర్.వి కృష్ణారెడ్డి. పేరెంట్స్ కమిటి చైర్మపర్సన్ ఎం.అమృత తదితరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**ఆత్మకూరు,నవంబర్26ప్రభాతవార్త:** ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సిడిపిఒ పి.సునీలత మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్యాంగ నిర్మాత , భారత రత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని రాజ్యసభ ఆమోదం తెలిపిందని, అనంతరం 1950జనవరి26 నుండి అమలులోకి వచ్చిందన్నారు. రాజ్యంగంలో పొందుపరచిన హక్కులు, విధులు, చట్టాలే ప్రజలకు రక్షణ కల్పిస్తున్నాయన్నారు. రాజ్యాంగానికి లోబడి ప్రతి ఒక్కరు పనిచేస్తూ దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం సూపర్‌వైజర్లతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎం.రత్నమ్మ,ఎన్.కె.నారాయణమ్మ, విజయలక్ష్మి,నాగేశ్వరమ్మ, కస్తూరి,సురేఖ, పద్మావతి, రమాదేవి, కార్యాలయ సిబ్బంది మహలక్ష్మి, కరీమా, రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'పేట' ఎంపిడిఒ కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగదినోత్సవం



**అనుమసముద్రంపేట, నవంబర్26ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేట ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్యాంగ నిర్మాత , భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్26న రాజ్యసభ ఆమోదం తెలిపిందని, అనంతరం 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందన్నారు. అధికారులు, సిబ్బంది రాజ్యాంగ బద్ధంగా నడవాలని తెలుపుతూ ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో సీనియర్ సహాయకులు మనోహర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకుడు ఖాదర్‌వలీ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గృహనిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి



**వింజమూరు,నవంబర్26ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో సొంతగృహ నిర్మాణం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పిఎంఎవై స్కీమ్ ద్వారా మండలంలో అత్యధికంగా నూతన గృహాల నిర్మాణాల మంజూరుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషిచేస్తున్నా రన్నారు. అర్హత కలిగినవారందరూ సొంత గృహ నిర్మాణం కోసం అవసరమైన డాక్యుమెంట్లు జెరాక్స్‌లను గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో అందజేసి బుధవారం లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పిఎంఎవై-2.0 రిజిస్ట్రేషన్‌కు రేషన్‌కార్డు, పాన్‌కార్డు, ఆదాయధృవీకరణ, జీవితభాగస్వామిపేరు, ఆధార్ , ప్రస్తుత చిరునామా , ప్రతిపాదిత స్థల చిరునామా, బ్యాంక్ వివరాలు , కులం వివరాలు, లబ్ధిదారుని తల్లి,దండ్రుల వివరాలు, ఆధార్, పేరు తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణి చేసిన హ్యాపీసేవాసంస్థ



**కావలిరూరల్, నవంబర్26 ప్రభాతవార్త** :హ్యాపీసేవాసంస్థ ఆధ్వర్యంలో ముసునూరు మర్రిచెట్టు కొత్తగిరిజనకాలనీలోని గిరిజనులకు హ్యాపీసేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి వ్యవసాయశాఖ సహాయసంచాలకులు నాగరాజు ముఖ్యఅతిధిగా పాల్గొని మంగళవారం దుప్పట్లు పంపిణిచేయడం జరిగింది. అనంతరం హ్యాపీసేవాసంస్థ సభ్యులు చేస్తున్న కార్యక్రమాలను అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా హ్యాపీసేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాష మాట్లాడారు. విశ్వోదయ బాలికోన్నతపాఠశాలలో వాచ్‌మేన్‌గా విధులు నిర్వహించిన షేక్.మీరాసాహెబ్ 21వ వర్ధంతి సందర్భంగా వారికుమారుడు షేక్.మస్తాన్‌సాహెబ్ (బుజ్జా) దాతృత్వంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియచేశారు. లోక్‌అదాలత్ సభ్యులు యం.మాలకొండారెడ్డి మాట్లాడారు. నిరుపేదలకు సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాపీసేవాసంస్థ సలహాదారులు చేవూరు ప్రభయ్య ఉపాధ్యక్షులు దేవరకొండ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## భారీ స్థాయిలో అన్నదానం



**ఇనమడుగు,(కోవూరు) నవంబం26 ప్రభాతవార్త** : కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సత్యానంద స్వామి ఆశ్రమంలో కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆశ్రమ ప్రాంగణంలో పెద్ద ఎత్తున వనభోజన కార్యమాన్ని అత్యంత వైభవంగా భారీ స్థాయిలో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ అన్నదాన కార్యమ్రంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, గుత్తికొండ వెంకయ్య, విజయకుమార్ రెడ్డి, బలరామ్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్రావు, తదితరులు ఉన్నారు.

## రాజ్యాంగం పట్ల అవగాహన అవసరం



**నెల్లూరు,నవంబరు26 ప్రభాతవార్త-విద్య** : సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నెల్లూరు, పిఎంపి అసోషియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం నగరంలోని స్థానిక బుజబుజనెల్లూరు లోని శేషుఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా క్షేత్ర సంచాలకులు పిట్ల హరికృష్ణ ముఖ్యఅతిధిగా పాల్గొని అంబేద్కర్ చిత్ర పఠానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతు రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించటం, రాజ్యాంగ బద్దమైనహక్కులు, కర్తవ్యాలపై దృష్టి సారించటం, భారత ప్రజల ఐక్యత, సమగ్రతను బలపరటం జరగాలన్నారు. ప్రతి కార్యాలయం, పాఠశాల, కళాశాలల్లో ప్రతిరోజు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు ఆదిశేషు, కుదుముల సుబ్బారావు, వేణుగోపాల్, షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## పాటూరు చేనేత కార్మికులకు అండగా విపిఆర్



**నెల్లూరు రూరల్, నవంబర్ 26, ప్రభాతవార్త** : నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కోవూరు నియోజకవర్గంలో ఉన్న పాటూరులో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు విన్నవించారు. మంగళవారం కేంద్రమంత్రి ఛాంబర్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ వేమిరెడ్డి.. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించారు. అనంతరం పాటూరులో క్లస్టర్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను కేంద్రమంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ చేనేత మరియు జౌళి శాఖ కమీషనర్.. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద ఐదు కొత్త స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను చేనేత అభివృద్ధి కమిషనర్‌కు సమర్పించారని, అందులో పాటూరు కూడా ఒకటని వివరించారు. పాటూరులో గ్రామంలో 500 చేనేత కుటుంబాలు పూర్తిగా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని ఎంపీ వేమిరెడ్డి అన్నారు. ఇక్కడ ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అంచనా వ్యయం రూ.76.320 లక్షలని పేర్కొన్నారు. పాటూరు స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌సిడిపి) ప్రతిపాదనలు అంగీకరించి మొదటి విడత నిధుల మంజూరుకు సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## వైసిపి సీనియర్ నాయకులతో చంద్రశేఖర్ రెడ్డి

**నెల్లూరు రూరల్, నవంబర్ 26, ప్రభాతవార్త** : వైసీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని 42, 43వ డివిజన్ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం సీనియర్ నాయకులు కలిసారు. నెల్లూరు ,రాంజీ నగర్ లోనీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హంజా హుస్సేని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సందాని, మున్వర్ అనుచరులు కలిశారు. ఆయా డివిజన్‌లలో పార్టీ బలోపేతంపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా డివిజన్ లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై స్పందించాలని పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కి సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి మేలు జరగాలని ఆకాంక్షిస్తూ మైనార్టీ నాయకులు అల్లాను ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

## శ్రీచైతన్య డిగ్రీకళాశాలలో ఘనంగా రాజ్యాంగదినోత్సవ వేడుకలు



**కావలిరూరల్, నవంబర్26 ప్రభాతవార్త** : రాజ్యాంగదినోత్సవం సందర్భంగా కావలిపట్టణంలోని శ్రీచైతన్యడిగ్రీ కళాశాలనందు రాజనీతిశాస్త్రవిభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగదినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.వి.రావు మాట్లాడారు. రాజ్యాంగం యొక్కప్రాధాన్యత, నియమ, నిబంధనలను విద్యార్థులకు తెలియచేయడం జరిగింది. రాజనీతిశాస్త్ర విభాగ అధ్యాపకులు బి.మోహన్‌రావు మాట్లాడారు. 2015 సంవత్సరంనుంచి రాజ్యాంగదినోత్సవవేడుకలను నిర్వహిస్తున్నారని తెలియచేశారు. రాజ్యా ంగంయొక్క ప్రావేశిక లక్షణాలను విద్యార్థులకు తెలియచేశారు. అనంతరం విద్యార్థులచేత రాజ్యాంగ ప్రతిజ్ఞ ను చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాక్ ప్రిన్సిపాల్ రవికాంత్, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు యస్.కె.రఫి, అర్ధశాస్త్ర అధ్యాపకులు కాంతారావు, మాధవరావు, యన్‌యస్‌యస్ ప్రోగ్రాం ఆఫీసర్ పివి.సాయితేజ, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, నవంబర్26 ప్రభాతవార్త** :కావలిరూరల్ మండలం చెన్నాయపాళెం పెద్దపట్టపు పాళెంలో గ్రామస్తుల ఆధ్వర్య ంలో ఏర్పాటుచేసిన అయ్యప్ప స్వామి అంబ లంపడిపూజ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు, అయ్య ప్పస్వామి భక్తులు ఘనస్వాగతంపలికి సత్కరించారు. విశేషపూజలు నిర్వహి ంచారు. అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. స్వామివారి అంబలంపడిపూజ మహోత్సవంగా పాల్గొనడం ఎంతోసంతోషంగా ఉందన్నారు. ప్రజలకు అయ్యప్పస్వామి కృపాకటాక్షాలు తప్పకుండా ఉండాలని స్వామిని వేడుకున్నారు. స్వామివారి చల్లనిచూపు కావలినియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే దగుమాటి పూజచేశారు. వేదపండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు.

## అక్రమమద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు

**కావలి, నవంబర్26 ప్రభాతవార్త** : జలదంకి మండలం చామదల గ్రామంలో చట్టవిరుద్ధంగా మద్యంసీసాలు విక్రయిస్తున్న వేములపాటి తిరుపాలయ్యపై ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్‌ఇన్స్‌పెక్టర్ యస్.శ్రీనివాసులు సిబ్బందితో మంగళవారం ఆకస్మికదాడులు నిర్వహించారు. పదమూడు మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిని అదుపులోకి తీసుకుని కేసునమోదుచేశారు. ఈ దాడుల్లో కావలి పిఅండ్‌ఈయస్‌ఐ దేవిక, తదితరులు పాల్గొన్నారు.

## డిఆర్డిఏ లో అంబేద్కర్‌కు ఘన నివాళి

**నెల్లూరు అర్బన్ నవంబర్ 26 ప్రభాతవార్త** : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డి.ఆర్.డి.ఏ కార్యాలయంలో , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి డిఆర్డిఏ పిడి నాగరాజుకుమారి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వంతో పాటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మరియు దేశంలో ఉన్నటువంటి అన్ని వర్గాల వారు సామాజికంగా ఆర్థికంగా సమానంగా ఉండాలని ఉద్దేశంతో రచించిన మహా వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి నివాళి అర్పించి సిబ్బంది అందరితో ఉపోద్ఘాతంను చెప్పించడమైనది.

## వైసీపీ నాయకుడు సాకేష్‌నీ పరామర్శించిన నేతలు



**నెల్లూరు రూరల్, నవంబర్ 26, ప్రభాతవార్త:** టిడిపి నాయకుల చేతిలో దాడికి గురైన వైసిపి యువజన విభాగం నాయకులు సాకేష్ రెడ్డిని వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డితో కలిసి పరామర్శించి ధైర్యం చెప్పి తోడుగా ఉంటామని తెలిపిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. నెల్లూరు రాంజీ నగర్ పుట్ట వీధిలో వైసీపీ యువజన విభాగం నాయకులు సాకేష్ రెడ్డి నివాసానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి వైసిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నగర వైసీపీ నాయకులతో కలిసి వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా దాడికి సంబంధించిన వివరాలను వారు సాకేష్ రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు. వారికి వారి కుటుంబానికి వైసీపీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ దాడి హేయమైన చర్య అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికాదని. దీనిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ న్యాయపోరాటం చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ. తెలుగుదేశం పార్టీ నేతలు సాకేష్ రెడ్డిని తీవ్రంగా కొట్టి విచక్షణారహితంగా గాయపరచి హత్యా యత్నానికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా ఈరోజు సాకేష్ రెడ్డి పై దాడి జరిగిందని అన్నారు. ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు జిల్లా లో ఇలాంటి దాడులు సరికాదన్నారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని తెలుగుదేశం పార్టీ నేతలు గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. సాకేష్ రెడ్డి పై దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకునేంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తే.. భవిష్యత్తులో ఆ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు వేలూరి మహేష్, కరిముల్లా, నీలి రాఘవరావు, కామాక్షి దేవి, జయలక్ష్మి, సీనియర్ నాయకులు హంజా హుస్సేనీ, మల్లి నిర్మల, కోటేశ్వర రెడ్డి, మున్వర్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ



**కోవూరు, నవంబరు 26 ప్రభాతవార్త** : ప్రపంచంలోని రాజ్యాంగాలన్నింటిలో భారత రాజ్యాంగం ఎంతో విశిష్టమైనదని కోవూరు తహసీల్దార్ నిర్మలానంద బాబా తెలిపారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం మనం 75 రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, అందులోని సమానత్వం, సోదరభావం, స్వేచ్ఛ, రాజకీయ సమానత్వం ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సుధా, సర్వేయర్ రమేష్‌గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**కోవూరు, నవంబరు 26 ప్రభాతవార్త** : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బబు రాజేం ద్రప్రసాద్, చాచా నెహ్రూ , సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ మాట్లాడుతూ భారతదేశంలోని ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యంగా జీవించడానికి రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలే ప్రధాన కారణమన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన చేసుకోవాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బబు రాజేంద్రప్రసాద్ వంటి ఎందరె మహనీయులు దేశప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం రూపొందించిన భారత రాజ్యాంగాన్ని గౌరవించుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, గీతామాధురి, తదితరులు పలు సూచనలు చేశారు. అనంతరం వ్యాసరచన , వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన పలు దేశ నాయకులు వేషధారణలు సభను అలరింపజేశాయి.

## గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**కోవూరు, నవంబం26 ప్రభాతవార్త** : కోవూరులోని పచ్చిపాల శంకర్‌రెడ్డి గ్రంథాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు లైబ్రేరియన్ జె. సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాఠకులు , పాఠశాల ప్రధానోపాధ్యాయిని భారతి, విశ్రాంత ఉద్యోగులు, చిన్నారులు ఉన్నారు.

## గిరిజనబాలుడికి వైద్యం అందచేసిన డాక్టర్ పి.శ్రీధర్



**కావలిరూరల్, నవంబర్26 ప్రభాతవార్త** : కావలిపట్టణం కాలేరుగుంట గిరిజన కాలనీలో గత ఎనిమిది సంవత్సరాలుగా అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమైన బాలుడు మాకాని శివయ్యకు సంయుక్తసేవాసంస్థ అభ్యర్ధనమేరకు మంగళవారం కావలి శ్రీధర్ మల్టిస్పెషాలిటి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పి.శ్రీధర్ బాలుడికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందచేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.శ్రీధర్ మాట్లాడారు. మాకాని శివయ్యకు ఫిజియోథెరపి చికిత్సచేయిస్తే చేతులు, కాళ్లు పనిచేసే అవకాశముంటుందని తెలియచేశారు. అలాగే యమ్మార్‌ఐ స్కానింగ్ తీయిస్తే మెదడు పనితీరు ఎలా ఉందో తెలుస్తుందని దానినిబట్టి తదుపరి వైద్యం చేయడం జరుగుతుందని తెలియచేశారు. సంయుక్తసేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర చేస్తున్న సేవలు అమోఘమని తెలిపారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. మాకాని శివయ్య గురించి తెలిసిన వెంటనే స్పందించి ఉచితంగా వైద్యంచేసి మందులు అందచేసిన డాక్టర్ పి.శ్రీధర్‌కు ధన్యవాదాలు తెలియచేశారు.

## రిలయన్స్‌సంస్థ తనను బాగావేధిస్తుంది..!



**కావలి, నవంబర్26 ప్రభాతవార్త** : రిలయన్స్‌సంస్థ సెల్‌టవర్ నిర్వాహకులు తనను బాగా వేధిస్తున్నారని బాధితుడు జె.శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కావలి రైల్వేరోడ్డులోని జర్నలిస్టుక్లబ్బులో మంగళవారం చేసిన మీడియాసమావేశంలో ఆయనపాల్గొని మాట్లాడారు. రిలయన్స్‌సంస్థకు చెందిన సెల్‌టవర్‌వారు తన ఇంటిపై టవర్ నిర్మించారన్నారు. ఈ బిల్డింగ్ టవర్‌నిర్మాణానికి అనుకూల ంగాలేదని తెలిపి ఎనిమిది సంవత్సరాలుగా ఆ టవర్‌ను తొలగి ంచకుండా తనను బాగా వేధిస్తున్నారని వాపోయారు. వెంగళరావునగర్‌లోని శివాలయ ంవీధిలో తాను నివసిస్తున్నానన్నారు. రిలయన్స్‌సంస్థ తన బిల్డింగ్‌పై జియో టవర్‌ను పెట్టాలని సంప్రదించి తన భార్య విజయలక్ష్మిపేరుమీద అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. 2016లో సైట్‌నెంబర్ 002 పెట్టారన్నారు. అనంతరంవారు ఎనిమిది నెలలు ఉంచి ఆ తర్వాత మీ బిల్డింగ్‌దీనికి అనుకూలంగాలేదని చెప్పారన్నారు. టవర్‌పైన టవర్ తీసుకుని బిల్డింగ్‌పైన ఉన్న రాడ్స్, వాటి పరికరాలను మాత్రం అలాగే ఉంచేశారన్నారు. వాటిని తొలగించాలని ఏడు సంవత్సరాలుగా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. దీనిమూలంగా బిల్డింగ్ నెర్రులిచ్చి స్లాబ్‌పెచ్చులు పడిపోతున్నాయన్నారు. అలానే పక్కన ఉన్నఇంటిపై దారినపోయేవారిపైకూడా ఈ పెచ్చులు పడుతున్నాయన్నారు. దీనివల్ల ప్రమాదం పొంచిఉందని వాపోయారు. ఈ టవర్‌వల్ల నాకు 30లక్షలరూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. బిల్డింగ్‌పై టవర్‌పరికరాలు తొలగించకపోతే చాలా ప్రమాదం జరుగుతుందన్నారు. అధికారులు సహకరించి ఆ టవర్‌ను ఆ సంస్థద్వారా తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, నవంబరు26 ప్రభాతవార్త** : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో కార్తీక మాస చి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారంఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులప ండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి,ఫణికుమార్ స్వామి, తదితరులు భక్తులు ఉన్నారు.

## రాజ్యాంగం పై విద్యార్థులకు క్విజ్ పోటీలు



**వరికుంటపాడు,నవంబర్ 26,ప్రభాతవార్త** : రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్కరించుకోని మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయులు ఎన్ .రవి మరియు సోషల్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.రాజ్యాంగ రూపకల్పన,ఆవశ్యకత గురించి పోటీలు నిర్వహించి ,విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా రాజ్యాంగం నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి ,రాజ్యాంగ పీఠిక పై విద్యార్థులకు వివరించారు.అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టి ,ఘనంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు.ఈ కార్యక్రమములో సోషల్ ఉపాధ్యాయులు పి.వెంకటేశ్వర్లు,ఎన్ రమణయ్య ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు ,విద్యార్ధిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా 75 వ భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు




**బుచ్చి నవంబర్ 26 ప్రభాతవార్త :** 75 వ రాజ్యాంగ దినోత్సవం వేడుకలను నారాయణపురం పాఠశాలలో డాక్టర్ చీదరాల చెన్నయ్య ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ముందుగా భారత రాజ్యాంగం అంటే ఏమిటో అందులో ఏముందో తెలియని వారు ఈదేశంలో ఎంతో మంది ఉన్నవారికి అర్ధమైన అర్ధం కాకున్నా ఎలాంటి వివక్షలేకుండా కంటికి రెప్పలా కన్న తల్లిలాదేశంలోనే ప్రజలందరిని కాపాడుతుందని అన్నారు. కనిపించని సింహములా ఆపన్నుల పాలిట జీవన రేఖ 75 ఏళ్ళుగా స్వేచ్ఛ స్వాతంత్రాలకు అనుక్షణం ఊపిరి లూదుతుంది మన రాజ్యాంగం అని అన్నారు. పాఠశాలలో జరిగిన అసెంబ్లీలో రాజ్యాంగ ప్రవేశికను గురించి అందరు చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో భారత రాజ్యాంగం గొప్పతనం గురించి స్లోగన్స్ చెబుతు ర్యాలీ నిర్వహించారు. అందరికి పండ్లు,మిఠాయిలు పంచారు. ఈకార్యక్రమంలో టీచర్ తుమ్మల కల్పన,కమీటి చైర్మన్ మోర్ల గోవర్దన్,వేగూరు వెంకయ్య, అట్ల ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ విలువలు నేటి తరం కాపాడాలి



**బుచ్చి నవంబర్ 26 ప్రభాతవార్త :** రాజ్యాంగ విలువలు నేటి తరం కాపాడాలని, ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం అయిన భారత రాజ్యాంగాన్ని మన పెద్దలు మనకు అందించారని ఎంఇఒ వెంకటరత్నం ,సామాజిక సమరసతా వేదిక బుచ్చి గౌరవ అద్యక్షులు వెంకటరమణయ్య, అధ్యక్షులు నరసింహామూర్తి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో జరిగిన భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వారు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. విద్యార్దులకు క్విజ్ పోటీలలో, డిబేట్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగం యొక్క చిత్రాలను జాతీయ చిహ్నాలను ప్రదర్శనగా ఏర్పాటు చేయగాతల్లిదండ్రులు విద్యార్దులు తిలకించారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్, ప్రిన్సిఫల్ సురేక, గండికోట సుధీర్, ఎంఆర్‌సి మల్లేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ,గిరిజ, ఆమని,అనిత, విజయలక్ష్మీ, వెంకటలక్ష్మీ విద్యార్దులు పాల్గోన్నారు.

===========================

ఫోటో 3 : డిజిటల్ మోసాలపై అవగాహన

డిజిటల్ మోసాలపై జాగ్రత్త వహించండి ...ఎస్బిఐ మేనేజర్ రామకృష్ణ

వింజమూరు,నవంబర్ 26,ప్రభాతవార్త : వింజమూరు జెడ్పి ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులకు సైబర్ నేరగాళ్ల పట్ల ఎలా జాగ్రత్త వహించాలో ఎస్బిఐ మేనేజర్ రామకృష్ణ అవగాహన కార్యాక్రమం నిర్వహించారు.ప్రస్తుతం డిజిటల్ యుగంలో ఉన్న మనము సైబర్ నేరగాళ్ల మాయలో పడి మోసాలకి గురి అవుతున్నారనీ,అప్రమత్తత లేకుంటే మీ ఖాతాలో నుండి నగదు మాయం అవుతాయని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాల్లో పలు రకాలుగా మీ ఫోన్లకు మెసేజ్లు పంపడం జరుగుతుందని వాటిని అనవసరంగా క్లిక్ చేయడం మీ పర్సనల్ డేటా మొత్తం సైబర్ నేరగాళ్లకు అందుతాయని తద్వారా మీ ఖాతాలోనే నగదు మాయమయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.పలు రకాల యాప్స్ సోషల్ మీడియాలో వస్తున్న మేసేజ్లతో జాగ్రత్త గా ఉండాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమములో ఫీల్డ్ ఆఫీసర్ మధు ,తదితరులుపాల్గొన్నారు.

## ఠాగూర్‌లో ఘనంగా భారత రాజ్యాంగదినోత్సవం



**అనుమసముద్రంపేట,నవంబర్26ప్రభాతవార్త:** మండలకేంద్రమైన ఏఎస్‌పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ సి.హెచ్. వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ కె.దొరస్వామిరెడ్డిల ఆధ్వర్యంలో రాజా ్యంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ రాజ్యాంగాలన్నింటిలో భారత రాజ్యాంగం పెద్దదని , రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి మెమొంటోలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్దులు, యువత క్రీడలపట్ల ఆసక్తిని చూపాలి



**కావలిరూరల్, నవంబర్26 ప్రభాతవార్త :** విద్యార్దులు, యువత క్రీడలపట్ల ఆసక్తిని చూపి అధికశాతం క్రీడాకారులుగా తయారు కావాలని విక్రమసింహపురి యూనివర్సిటి వైస్‌ఛాన్సలర్ యస్. విజయభాస్కర్‌రావు తెలియచేశారు. విక్రమసింహపురి యూనివర్సిటి అంతర్ కళాశాలల క్రీడాపోటీలు మంగళవారం విక్రమసింహపురి యూనివర్సిటి కావలి పి.జి సెంటర్‌నందు నిర్వహించడం జరిగింది. రెండురోజులపాటు నిర్వహిస్తున్న క్రీడాపోటీలలో వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, టగ్‌ఆఫ్‌వార్ క్రీడాపోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు ముఖ్యఅతిధిగా విక్రమసింహపురి యూనివర్సిటి వైస్‌ఛాన్సలర్ యస్.విజయభాస్కర్‌రావు ముఖ్య అతిధిగా పాల్గొని క్రీడలను ప్రారంభించడం జరిగింది. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల్లో విద్యార్థులు, యువత అధికశాతంపాల్గొని క్రీడాస్పూర్తిని కలిగిఉండి ఎక్కువశాతం క్రీడాకారులుగా తయారుకావాలని తెలియచేశారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడాకారులు ఈర్ష్యా, ద్వేషాలుమాని క్రీడాస్పూర్తితో ఆడాలని తెలియచేశారు. ఎందుకు ఓడిపోయామా అని అనుకోవడంకాదని ఎందుకు గెలవలేకపోయామా అనుకోవాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ఆర్థికంగా సహాయసహకారాలు అందించేందుకు ఎల్లవేళలా సిద్దంగా ఉంటానని తెలియచేశారు. అనంతరం టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరి సిహెచ్.మణికంత, మరియు క్రీడాకారులు జవహర్‌భారతి కళాశాల విశ్రాంత ఫిజికల్ డైరక్టర్, స్వయంఉపాధి కోర్సులడైరక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వియస్‌యు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కావలి పి.జి సెంటర్ ప్రిన్సిపాల్ వీరారెడ్డి, టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి ఫిజికల్ డైరక్టర్లు రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు క్రీడాకారులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకపాలన సాగిస్తున్నాయి

## కావలిలో కార్మికసంఘాల ఐక్యవేదిక నిరసనలు



**కావలి, నవంబర్26 ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకపాలనను సాగిస్తున్నాయని సిఐటియు నేతలు తెలిపారు. కేంద్రప్రభుత్వ ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలపై మంగళవారం కావలిలో నిరసన నినాదాల ప్రదర్శన నిర్వహించారు. కావలి ఏరియా వైద్యశాలనుంచి ట్రంకురోడ్డులో పొట్టిశ్రీరాములు సెంటర్‌మీదుగా ఉదయగిరి బ్రిడ్జికూడలివద్ద ఈ ప్రదర్శనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. కేంద్రసంయుక్త కిసాన్‌మోర్చ కార్మికసంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపుమేరకు ఈ నిరసనలు వ్యక్తంచేయడం జరిగిందన్నారు. కేంద్రంలో పరిపాలిస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక వ్యతిరేకపాలన సాగిస్తుందన్నారు. కార్మికులు పోరాడిసాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేశారన్నారు. కార్మికులకు వ్యతిరేకమైన 4 నల్లచట్టాలను కేంద్రం తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలకు నిధులు కేటాయించకుండా నీర్వీర్యం చేస్తుందన్నారు. కేంద్రసంస్థలను ఆదానిలాంటివారికి కారుచౌకగా కట్టబెడుతుందన్నారు. నిత్యావసరసరుకులు, పెట్రోలు, డీజిల్ నియంత్రించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చిన్ని రాజ్‌గోపాల్, రైతునాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, గడ్డం మాల్యాద్రి, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు టి.మాల్యాద్రి, రావి మాల్యాద్రి, దర్గాబాబు, సిఐటియు నాయకులు తురక శ్రీను, యం.పోలయ్య, బి.మహేష్, ఒంగోలు రమేష్, ఏఐటియుసి నాయకులు మల్లి అంకయ్య, వెండ్లూరి ఆదినారాయణ, రావినూతల వెంకటేశ్వర్లు, రైతులు, వ్యవసాయ కార్మికసంఘాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక ప్రచారం విజయవంతం



**ఉదయగిరి, నవంబర్ 26, ప్రభాతవార్త :** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో జరిగిన ఓటర్ల ప్రత్యేక ప్రచారం విజయవంతమైనట్లు ఉదయగిరి తహశీల్దార్ ఎం.సుభద్ర తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో 323 పోలింగ్ బూత్‌లకు గాను 68 కొత్త ఓటర్లు నమోదుకు 41 ఓట్లు చనిపోయిన వారివి, వివాహం చేసుకుని వెళ్లిన వారి ఓట్లు తొలగించేందుకు, 46 ఓట్లు ఓటర్ల లిస్టులో పేరు, చిరుమానాలో మార్పులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు వచ్చాయన్నారు.

## బాల్య వివాహాలపట్ల అవగాహన కార్యక్రమం



**సంగం నవంబర్ 26 ప్రభాతవార్త :** సంగం మండలం దువ్వూరు సెక్టార్ పరిధిలోని జెండాదిబ్బ ( ఎస్టి) అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో బాల్య వివాహాలపట్ల అవగాహన కార్యక్రమాన్ని దువ్వూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.రమాదేవి సిడిపిఒ గారి ఆదేశాల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు సిడిపిఒ పి .సునీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు బాల్య వివాహల వలన అనేక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, నష్టాలు ఉంటాయని తెలిపారు. 18 సంవత్సరాలలోపు బాలికలకు 21 సంవత్సరాల లోపు బాలురుకు వివాహాలు చేసుకోకూడదని చెప్పారు. అందరి ఆరోగ్యం రిత్యా బాల్యవివాహాలను ప్రభుత్వం నిరోదించందని అందువలన విద్యార్థినులు,కిషోర బాలికలు తగిన అవగాహనతో బాల్య వివాహాలను నిరోదించాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తమ వంతుగా బాల్య వివాహం నిరోదానికి కృషి చేయాలని సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నరేష్ చౌదరి, కె. నారాయణనాయుడు, పి.ఫయాజ్, ఎస్‌కె. షపి, అంగన్‌వాడీ కార్యకర్తలు డి లీలమ్మ, ఎం.చెంచయ్య, ఎంఎస్‌కెఎస్ ,ఎఎన్ఎం, ఆశా పాల్గోన్నారు.

## మండల పరిషత్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం



**కలిగిరి, నవంబర్26, ప్రభాతవార్త;** 75వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం కలిగిరి మండలం అయ్యపరెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాలలో జరుపుకు న్నారు. మండల విద్యాశాఖ ఆదేశాలమేరకు జరిగిన ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులచేత ప్రతిజ్ఞచేయించారు. అనంతరం మన భారత దేశ గొప్పతనాన్ని గురించి ,మన సాంప్రదాయాలు, సంసృతులుగురించి విద్యార్దులకు వివరించారు.తదుపరి భారత స్వాతంత్ర్యపోరాటంలో ప్రాణాలు దారపోసిన అమర వీరులకు అంజలిఘటించారు.అదేవిదంగా మన రాజ్యాగంరూపొందించుటకు తోడ్పాటు నందించిన వారందరికీ ఉపాధ్యాయులు, విద్యార్దులు చప్పట్ల ద్వారాఅభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుల వెంకటేశ్వర్లు,గాదిశెట్టి మురళీకృష్ణ,అంగన్‌వాడీ టీచర్ సుంకర మాదవి విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికోన్నత పాఠశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**ఆత్మకూరు,నవంబర్26ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు, సోషల్ డే ను ప్రధానోపాధ్యాయులు కె.కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ డిఇఒ గోపాల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ భావాలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలన్నారు. డాక్టర్ అంబేద్కర్ ఎంతో శ్రమించి వ్రాసిన భారత రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. స్థానిక సోషల్ టీచర్ దమ్ము పద్మమ్మ మాట్లాడుతూ మన రాజ్యాంగ రూపశిల్పి జీవితచరిత్రను , రాజ్యాంగదినోత్సవ ప్రాముఖ్యతను, సోషల్ డే ప్రత్యేకతను గురించి వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమావతి, సుబ్రహ్మణ్యం, వి.భారతి, పాఠశాల ఉపాధ్యాయినిలు, ఉపాధ్యాయులు , పాఠశాల సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ రాజ్యాంగ ఫలాలు అట్టడుగు వర్గాలకు అందడంలేదు

## దళితసంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యస్.మల్లి




**కావలి, నవంబర్26 ప్రభాతవార్త :** అంబేద్కర్ రాజ్యాంగఫలాలు అట్టడుగు వర్గాలకు అందడంలేదని దళితసంఘర్షణసమితి జిల్లా అధ్యక్షుడు యస్. మల్లి తెలిపారు. కావలి పట్టణ ట్రంకు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘర్షణసమితి ఆధ్వర్యంలో పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 75వ భారతరాజ్యాంగ ఆమోదదినోత్సవం సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగం అట్టడుగు వర్గాలకు దక్కడంలేదన్నారు. దళితుల్లో, గిరిజనుల్లో ఉద్యోగస్తుల బిడ్డలకే ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. అట్టడుగు వర్గాల బిడ్డలకు మొండిచేయి చూపిస్తున్నారన్నారు. ఈ పరిస్థితి గమనించి సుప్రీంకోర్టుకూడా క్రిమీలేయర్ పెట్టాలని సూచించిందన్నారు. ఒకతరం ఉద్యోగాలు సంపాదించుకుని తమ తల్లిదండ్రులను, బంధువులను చూడడంలేదన్నారు. రాష్ట్రప్రభుత్వం భూమికొనుగోలు పథకం, భూమిపంపిణి పటిష్టంగా అమలుచేసి అంబేద్కర్ కలలుగన్న సామాజికన్యాయం జరుగుతుందన్నారు. రాజ్యాంగం వ్రాసి 75సంవత్సరాలు అవుతున్నా తహశీల్దారు కుమారుడు తహశీల్దారు అవుతున్నారని పేద దళితులు తహశీల్దారులు కావడంలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వమైనా దళితవర్గాలకు విభేదాలు పెట్టకుండా భూమిపంపిణి భూపథకం, రుణసౌకర్యాలు, ట్రాక్టర్, జెసిబి, ఇన్నోవాకార్లు పేదలకు ఇస్తే కొంతవరకు పేదరికం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ నాయకులు జరుగుమల్లి రత్నం, యానాదిసంఘం నాయకులు చౌటూరి లక్ష్మయ్య, దళితనాయకులు చెరుకూరి జనార్ధన్, సీనియర్ న్యాయవాది సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయి చారిటబుల్‌ట్రస్ట్, సహృదయ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

## మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్



**కావలి, నవంబర్26 ప్రభాతవార్త :** కావలి శ్రీసాయి చారిటబుల్‌ట్రస్ట్, సహృదయ ఫౌండేషన్ చేస్తున్నసేవలు ఎంతైనా ప్రశంసనీయమని కావలి మున్సిపల్ కమీషనర్ జి. శ్రావణ్‌కుమార్ తెలిపారు. కావలి మున్సి పాలిటి పరిధిలోని పెంకులఫ్యాక్టరి చెరువ ఎకట్టసంఘం శివరామ సుబ్బయ్య కాలనీ వాసులకు చలికాలం దృష్ట్యా దుప్పట్లు పంపి ణి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఎవరోవస్తారని ఏదోచేస్తారని ఎదురుచూడకుండా స్వచ్ఛందసంస్థలు ముందుకువచ్చి పేదప్రజలను ఆదుకోవాలని కోరారు. చలికాలం దృష్ట్యా పేదలు ఇబ్బందిపడకుండా స్వచ్ఛందసంస్థలు ముందుకువచ్చి దుప్పట్లు పంపిణిచేసి వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**సంగం నవంబర్ 26 ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సంగం ఎంపిడిఒ కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇఒఆర్‌డి ప్రసాద్ మాట్లాడుతు ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం మన రాజ్యాంగం అని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం లిఖిత పూర్వక రాజ్యాంగం అని ఆయన వివరించారు. నేటి తరానికి రాజ్యాంగం విలువల గురించి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశ ప్రజలందరికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సైభ్రాతృత్వాలను అందిస్తు రూపొందించిన మన భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26 న ఆమోదించడం జరిగిందిన ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో ఎండిఒ కార్యాలయం సిబ్బంది, సెక్రటరీలు పాల్గోన్నారు.

## ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి




**కోవూరు, నవంబం26 ప్రభాతవార్త :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌లో ఉన్న వైకేఆర్‌అండ్‌కే ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ జాబ్‌మేళాకు 92 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వారికి అన్ని పరీక్షలు నిర్వహించిన తర్వాత 39 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వారందరికీ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ఈ అవకాశాన్ని యువత పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌ప్రసాద్, అధ్యాపకులు ఉన్నారు.

## గీతాంజలిలో ఘనంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవం



**కోవూరు, నవంబం26 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది కె. మురళీరెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ , బాబు రాజేంద్రప్రసాద్ వంటి మహనీయుల మేదస్సు నుంచి ఉద్భవించిందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు కేవలం సాంకేతికతకు సంబంధించిన అంశాలనే కాక భారత రాజ్యాంగం గురించి కూడా అధ్యయనం చేయాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని పౌరహక్కులను , పౌర విధులను , పార్లమెంట్, అసెంబ్లీ వంటి శాసనసభల యొక్క నిర్మాణాన్ని, వాటి విధులను అధికారాలను అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి వై. మురళీకృష్ణ, తదితరులు ఉన్నారు.

## రుణలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, నవంబం26 ప్రభాతవార్త :** కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పొదుపు గ్రూపు అధ్యక్షులతో ఆర్‌జీబీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సుబ్బరాజు మాట్లాడుతూ పొదుపు గ్రూపు అధ్యక్షులు తమ గ్రూపులోని సభ్యులందరూ పూర్తిగా అక్షరాస్యులుగా ఉండేలా వారిలో అవగాహన పెంచాలన్నారు. క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకుని బ్యాంకుల ద్వారా వచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సమాజంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులను అలవరుచుకుని కొత్త వ్యాపారాలపై దృష్టి పెట్టాలన్నారు. బ్యాంకుల ద్వారా స్త్రీనిధి, ఉన్నతి, సీఎఫ్ రుణాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలన్నారు. అంతకుముందు భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు రాజశేఖర్, చైతన్య బాబు, రాము, శోభ, పొదుపు గ్రూపుల అధ్యక్షులు ఉన్నారు.

## వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



**కోవూరు, నవంబం26 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సత్యానంద స్వామి ఆశ్రమంలో కార్తీక మాస మంగళవారం సందర్భంగా గ్రామంలోని గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహాయ సహకారాలతో సామూహిక సత్యనారాయణ వ్రతం కార్యక్రమాన్ని 108 జంటలతో అత్యంత వైభవంగా సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రధాన రుత్వికులు కె. నమశ్శివాయ శర్మ సత్యనారాయణ వ్రత విధానా న్ని భక్తులకు వివరించారు. ఈ వ్రత కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తే సత్ఫలితాలు తప్పక వస్తాయని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, గుత్తికొండ వెంకయ్య, విజయకుమార్ రెడ్డి, బలరామ్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్రావు, తదితరులు ఉన్నారు.

## తలసేమియా వ్యాధిపీడితులకు రక్తమార్పిడి



**కావలి, నవంబర్26 ప్రభాతవార్త :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి డే కేర్‌సెంటర్‌లో మంగళవారం ముగ్గురు తలసేమియా వ్యాధిపీ డితులకు రక్తమార్పిడి నిర్వహిం చారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడారు. తలసేమియా అనేది రక్తంపై ప్రభావంచూపే వంశపారంపర్యం వ్యాధిఅన్నారు. ఈ వ్యాధులు శరీరానికి అవసరమైనంత హీమోగ్లోబిన్ ఉత్పత్తికాదు, ఉత్పత్తి అయినా ఎక్కువకాలం నిల్వఉండదన్నారు. హీమోగ్లోబిన్ నిల్వలు తగ్గినపుడు కృత్రిమంగా రక్తంద్వారా హీమోగ్లోబిన్ అందించాలన్నారు. సకాలంలో రక్తం అందించకపోతే ప్రాణాలకు ముప్పువాటిల్లవచ్చునన్నారు. తాము అత్యంత వ్యయప్రయాసలకోర్చి కావలి రెడ్‌క్రాస్ ప్రాంగణంలో తలసేమియా ఆసుపత్రిని ఏర్పాటుచేశామన్నారు. వైద్యులు, సామాజిక, ఆరోగ్య కార్యకర్తలు తలసేమియా వ్యాధిలక్షణాలు ఉన్నవారిని గుర్తిస్తే తమ ఆసుపత్రికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రక్తమార్పిడి చేయించుకున్న ప్రభాకర్, మల్లికార్జున, సయ్యద్ రిహాన్‌లకు మందులు, పోషక ఎండుఫలాలు అందించి భోజన ఏర్పాట్లు చేశారు. తలసేమియా ఆసుపత్రి ప్రధానదాత రమేష్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రమ్య, తలసేమియా డే కేర్‌సెంటర్ నిర్వహణకమిటీ కన్వీనర్ కె.హరినారపరెడ్డి, సభ్యులు కల్లయ్య, సాయికుమార్, జమున, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాకారపు రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, రొటేరియన్లు నల్లూరు రవికుమార్, గోపికృష్ణ, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులు, చినుకులు.

**కలిగిరి, నవంబర్26, ప్రభాతవార్త;** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనభావంతో కలిగిరి మండలంలో విపరీతంగా ఈదురుగాలులువీస్తున్నాయి. వాటికితోడు చినుకులతో కూడిన చిరుజల్లులు పడుతుండడంతో ప్రజలు చలికి గజగజ ఒణుకుతున్నారు. దీనితో ప్రజలు బయటకు రావడానికి భయపడిపోతున్నారు. సోమవారం మబ్బులు పట్టినా మంగళవారం నుండి అప్పుడప్పుడూ చిరుజల్లులుపడుతున్నాయి. దీనికి తోడు ఈదురు గాలులు వీస్తుండడంతో చంటిబిడ్డలు వయస్సు మళ్లిన వారు చలికి వణికిపోతున్నారు.ఇప్పుడు వానలు పడితో వరికి, నిమ్మ తదితరపంటలకు మేలుకలుగుతుందని కొందరు సంతోషపడుతుండగా మినుము, పొగాకు పంటలకు ఇబ్బందులు తప్పవని మరికొందరు రైతులు ఆంధోళన వ్యక్తం చేస్తున్నారు. మినుముపంట పూత దశలో ఉండడంతోవానలు విస్తారంగా కురిస్తే పూత రాలిపోయి ,పొలం ఊటపడితే ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోలన చెందుతున్నారు. ఇప్పుడే బారీగా కర్చులు పెట్టి పొగమొక్క వేశామని ఇప్పుడు వానలు పడితే మొక్క దెబ్బతినే పరిస్తితి వస్తుందని మరికొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెట్టప్రాంతమైనందున అన్నిచెరువులకూ సరిపోయినంతగా నీరురాకపోవడంతో ఒకమంచి వానలు పడితే చెరువులు నిండుతాయని మరికొందరు చెబుతున్నారు.అయితో ఈతుపాన్ ప్రభావం ఎలా ఉంటుందో చూడాలిమరి..

## రాగల రమణయ్యకు డాక్టరేట్ ప్రదానం



**కోవూరు, నవంబం26 ప్రభాతవార్త :** విక్రమ సింహపురి యూనివర్సిటీ కావలి క్యాంపస్ వాణిజ్య విభాగానికి చెందిన పరిశోధకుడు కోవూరు చెందిన రాగల రమణయ్యకు విక్రమ సింహపురి యూనివర్సిటీ పీహెచ్‌డీ డిగ్రీ పట్టా ప్రదానం చేసింది రాగల రమణయ్య డెవలప్‌మెంట్ ఆఫ్ మేనేజిరియల్ పర్సనల్ ఇన్ సెలెక్ట్ మానిఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీ ఆఫ్ ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఆయనకు విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రమణయ్య చిన్నప్పటి నుంచి చదువు అంటే ఎంతో మక్కువతో ఎంబీఏ పూర్తి చేసి విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఆర్ సెట్‌లో మంచి ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎం. చంద్రయ్య ఆధ్వర్యంలో పరిశోధన చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినందుకు తమకెంతో ఆనందంగా ఉందన్నారు. తాను ఈ పరిశోధన చేసేందుకు సహాయ సహకారాలు అందించిన కావలి క్యాంపస్ వాణిజ్య విభాగానికి, కళాశాల ప్రిన్సిపాల్, వాణిజ్య విభాగాధిపతి గైడ్ చంద్రయ్యకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తు న్నా మన్నారు. రానున్న రోజుల్లో ఫెలోషిప్ డాక్టరేట్ సాధించడమే తన జీవితలక్ష్యమన్నారు.

# గొప్పసేవాతత్పరులు స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి



**కావలిరూరల్, నవంబర్26 ప్రభాతవార్త** గొప్పసే వాతత్పరులు, విద్యాదాత చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా ఉచిత మంచినీటిసరఫరా చేసి పేదలదాహార్తిని తీర్చి న మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి అని కావలి మాజీ మున్సిపల్‌ఛైర్మన్ ప్రముఖవైద్యులు డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు తెలియచేశారు. కావలిపట్టణంలోని పియస్‌ఆర్ ట్రస్ట్ హాస్పిటల్‌నందు మంగళవారం స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి 77వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ య న్.ప్రభాకర్‌నాయుడు మాట్లాడారు. స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి నవంబర్ 26, 1947 సంవ త్సరంలో జన్మించినా రన్నారు. ఆయన పేదప్రజలకు ఎన్నో సేవాకార్యక్రమాలను చేసి అందరిమన్నలను పొందడం జరిగిందన్నారు. 1991-96 సంవత్స రాలలో ఒంగోలు లోక్‌సభ సభ్యులుగా ఉన్నపుడు కొన్ని వివత్కర పరిస్థితులో స్వర్గస్తులవడం జరి గింది. ఆయన పవిత్రాత్మకు శాంతిచేకూరాలని కోరుకుంటున్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ముస్లింమైనారిటి నాయకులు, మాజీ కౌన్సిలర్ షేక్.మస్తాన్, విశ్రాంత వసతిగృహ సంక్షే మాధికారి, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవఅ ధ్యక్షులు షేక్.ఖాదర్‌బాష, వైద్యశాల సిబ్బంది మా ధవరావు, సాయి, వైద్యశాల పిఆర్‌ఓ అక్కిలిగుంట ఆనందరావు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రమాదాల నివారణకై అప్రమత్తత అవసరం



**నెల్లూరు,నవంబరు26 ప్రభాతవార్త-విద్య** ప్రకృతి వైపరిత్యాలు, అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు మనం తీసుకునే నిర్ణయాలే మన ప్రాణాలను రక్షిస్తుందని, ఇటువంటి వాటిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఇంటర్ బోర్డుప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక డికే జూనియర్ కళాశాలలో ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వైపరిత్యాలు జరిగినపుడు ఆందోళన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించి స్వియ రక్షణతో బాటూ పొరుగువారికి సహాయ పడాలని కోరారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్స్పెక్టర్ రాజీవ్ దరిపా మాట్లాడుతు తుఫాను, భూకంపాలు, అగ్నిప్రమాదాలు, గుండెపోటు, వంటి అత్యవర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం అత్యవరసర సమయాల్లో వినియోగించే కిట్స్‌ను కళాశాలకు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎష్ అధికారులు కరుణకుమారి, భారతి, ప్రసన్న, సిబ్బంది కృష్ణవేణి, సుధారాణి, విజయలక్ష్మీ, కృష్ణ తులసి, పూర్ణచంద్ర కుమారి, సమత, ప్రవీణ, శ్రీలక్ష్మీ, ఉషామాదవి, శివయ్య, పాల్గొన్నారు.

## ఘనంగా 75 వ భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు



**నెల్లూరు రూరల్, నవంబర్ 26, ప్రభాతవార్త** నెల్లూరు వైఎస్ఆర్సిపి నగర నియోజకవర్గ కార్యాలయంలో భారతదేశ రాజ్యాంగం రూపొందించబడి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా.. వైసీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గారు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## జడ్‌పీ లో అంబేద్కర్ కు ఘన నివాళులు



**నెల్లూరు అర్బన్, నవంబర్ 26, ప్రభాతవార్త** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ , సీఈవో విద్య రమ, డిప్యూటీ సీఈవో మోహనరావుతో కలిసి నివాళులు అర్పించడం జరిగింది. ఎం.పీ.డీ.వోలు,జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు....చోద్యం చూస్తున్న అధికారులు



**వరికుంటపాడు, నవంబర్ 26, ప్రభాతవార్త :** మం డల కేంద్రంలోని ప్రధాన వీధిలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు చెట్లను తాకుతుండడంతో చుట్టు ప్రక్కల ఉండే ఇళ్ల వారు విద్యుత్ కోసం నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన ,గాలి వీచిన ఆ విద్యుత్ తీగలు చెట్లుకు తగు లుతుండడంతో ఒక్కసారిగా కరెంటు పోతూ వ స్తూ డండంతో విద్యుత్ ఉపకరణాలు కాలిపోతు న్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రమాదకరంగా తీగలు వేలాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ,ఎన్నో సార్లు విన్నవించుకున్న తమ గోడును అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరి చేయా లని ప్రజలు కోరుతున్నారు.

## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా



ఉదయగిరి, నవంబర్ 26, ప్రభాతవార్త కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉదయగిరి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయగిరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథ్ సిఫార్సులు అమలు చేయాలని, కార్మిక చట్టాలను పునరుద్దరణ చేయాలని విద్యుత్ సవరణ బిల్లులను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఔట్‌సోర్సింగ్ అన్ని రకాల ఉద్యోగులకు కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మాగుంట కుటుంబం ఆశయసాధనకు కృషిచేస్తా..! ఎమ్మెల్యే



**కావలి, నవంబర్26 ప్రభాతవార్త** సేవకు ప్రతిరూపంగామారిన మాగుంట కుటుంబం ఆశయసాధనకు కృషిచేస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలిప్రజల దాహార్తిని తీర్చిన మహనీయుడు మాగుంట సుబ్బరామిరెడ్డి అని కొనియాడారు. కావలి పట్టణ ఆర్టీసి ఎదురుగా ట్రంకురోడ్డులో ఉన్న దివంగత మాజీఎంపి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహంవద్ద మంగళవారం 77వ జయంతివేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ పట్టణకమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుబ్బరామన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సేవచేయాలనే ధృఢసంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చి ఒంగోలు పార్లమెంటు సభ్యులుగా మాగుంట గెలుపొందారన్నారు. దేశప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులనుండి ప్రశంశలు అందుకున్నవ్యక్తి మాగుంట అన్నారు. కొన్ని అనుకోని పరిస్థితులలో నక్సలైట్లచేతుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారన్నారు. నాకు, ఆయనకు వ్యక్తిగతంలో చాలా అనుబంధముందన్నారు. తాను మొదట ఉద్యోగం సాధించింది ఆయన స్థాపించిన కళాశాలలోనే అని గుర్తుచేశారు. ఆయన స్థాపించిన కళాశాలలో తాను అధ్యాపకుడుగా పనిచేయడం జరిగిందన్నారు. సుబ్బరామన్నతో మంచి సాన్నిహిత్యం ఉండేదన్నారు. కావలి నియోజకవర్గంలో సుబ్బరామిరెడ్డి అనేక సేవాకార్యక్రమాలు చేపట్టి సేవాతత్పరుడుగా కొనియాడబడుతున్నారన్నారు. కావలి మున్సిపాలిటిపరిధిలో వెంగళరావునగర్, తదితర పేదవాళ్ల నివసించే అనేక కాలనీల్లో ట్యాంకర్లద్వారా ఉచితంగా మంచి నీటిని సరఫరాచేసి దాహార్తిదాతగా నిలిచిపోయారన్నారు. రాజకీయాల్లో ఉన్నాలేకున్నా నిరంతరం కావలిప్రజల దాహార్తిని తీర్చిన కుటుంబం మాగుంటకుటుంబమన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మాగుంట సుబ్బరామన్నమృతితో కోలుకోలేనిదెబ్బ తగిలిందన్నారు. ఆలోటుతో అభివృద్ధిఫలాలు అందుకోవడంలో ఈ రెండు జిల్లాలు కొంతవెనకడుగు కనిపిస్తుందన్నారు. మాగుంట సుబ్బరామిరెడ్డి ఆశయాలను కొనసాగించడానికి ప్రతినాయకుడు నడుంబిగిస్తున్నారని తెలిపారు. తెలుగుదేశంపార్టీ శ్రేణులు నిరంతరం మాగుంట సుబ్బరామిరెడ్డి, ఆయన సతీమణి మాగుంట పార్వతమ్మ ఆశయాలను కొనసాగిస్తారన్నారు. వారి ఆశయ సాధనకోసం కావలినియోజకవర్గంలో పలుకార్యక్రమాలు చేపడతామన్నారు. మాగుంట సుబ్బరామన్న విగ్రహాన్ని పూలమాలలతో ముంచెత్తారు. "అమర్‌రహే సుబ్బరామన్న" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కావలిపట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతి బాబురావు, లీగల్‌సెల్ కావలినియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, పట్టణ మహిళాఅధ్యక్షురాలు అర్షియాబేగం, తిరివీధి ప్రసాద్, మాగుంట కళాశాల విద్యార్థులు, టిడిపినాయకులు, కార్యకర్తలు, మాగుంట అభిమానులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రులను కలిసిన జిల్లా కార్యవర్గ కార్యదర్శి



**వింజమూరు, నవంబర్26ప్రభాతవార్త:** రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలాంజనేయులను జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డిలు మంగళవారం అమరావతిలో కలిశారు. ఈసందర్భంగా రాష్ట్ర రైతాంగానికి గత ప్రభుత్వం విద్యుత్ సరఫరాలో అన్యాయం చేసిందన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి రైతులకు విద్యుత్ అందిస్తున్న విధానం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో అన్ని మండలాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయన్నారు.

## ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**నెల్లూరు,నవంబరు26 ప్రభాతవార్త-విద్య** జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి , కోర్ కమిటీ సభ్యులు గు నుకుల కిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నగరం లోని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ ను నిర్వహించారు. ఈ సందర్భంగా గనుకుల మాట్లాడుతు దేశ ప్రధాని నరేంద్ర మెదీ పిలుపుమేరకు రాజ్యాంగ పీఠికను చదవి ప్రతిజ్ఞ చేయటం జరిగిందన్నారు. 1949 నవంబరు 26న రాజ్యాంగాకి సభ అమెదం తెలిపిందన్నారు. దీనిని ప్రతీకక ప్రతి ఏడాది ఆరోజు రాజ్యాంగ దినోత్సవంగా జరపుకోవటం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రధాని పిలుపుమేరకు ప్రతి విద్యాలయంలో ప్రతిరోజూ రాజ్యాంగ పీఠిక సమూహిక పఠనం జరపాలకి కోరారు. దేశ రాజ్యాగంతో ప్రతి పౌరునికి ఆర్థిక,సామాజిక, రాజకీయ సమానత్వం అందుతుందన్నారు. ప్రదామిక హక్కులు, ఆదేశికసూత్రాలు, ప్రజలకు రక్షణ కవచంలా రాజ్యాంగం రూపొందించ బడిందన్నారు. ఆర్టికల్370 రద్దు చేయటం ద్వారా దేశవ్యాప్తంగా ఒకే రాజ్యాంగాన్ని అమలు చేసిన ఘనత మెదీకే దకు ్కతుందన్నారు. భవిష్యత్‌లో భారత్ 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోనుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ఆదిరక్ర వ్యవస్థ 1 ట్రిలియన్ డాలర్లకు చేరులా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లు ప్రణాళికలను రూపొందించటం జరిగిందన్నారు. విజన్ 2047లో భాగంగా రాష్ట్రం 2.4ట్రిలియన్ డాలర్లకు చేరే దిశగా కృషి జరుగుతుందన్నారు. అంబేద్కర్ ఆశయసాదనకు తమ జనసేన పార్టీ నిత్యం పాటుపడుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్‌గౌడ్ , సంతోష్, వెంకటేశ్వర్లు,రాజు, తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ సీఈఓ ను కలిసిన పి.ఆర్ అసోసియేషన్ నాయకులు



**నెల్లూరు అర్బన్, నవంబర్ 26, ప్రభాతవార్త** జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఎం. విద్యారమ, డిప్యూటీ సీఈవో జే మోహన్ రావు ని ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య దేవ ప్రసన్న కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పంచాయతీరాజ్ ఉద్యోగుల పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకొని పోయారు. వాటిలో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతులు కల్పించి త్వరగా ఇవ్వాలని కోరారు. సురేష్ బాబు అనిల్ రమేష్ బాబు పాల్గొన్నారు.

## మాజీఎమ్మెల్యే కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం



**కావలి, నవంబర్26 ప్రభాతవార్త** కావలి వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైసిపి కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ ఆమోదదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఆదేశాలమేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, కనపర్తి రాజశేఖర్, మాల్యాద్రి, వైసిపి నేతలు చెన్ను ప్రసాద్‌రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, పరుసు మాల్యాద్రి, మండలి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గొప్పతనాన్ని, రాజ్యాంగాన్ని కొనియాడారు.

## కలెక్టరేట్లోని అంబేద్కర్ కు ఘన నివాళులు



**నెల్లూరు అర్బన్, నవంబర్ 26, ప్రభాతవార్త** మంగళవారం ఉదయం కలెక్టరేట్లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరించి, అధికారులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించడానికి రాజ్యాంగం పీఠికలో పేర్కొన్న అంశాలే ప్రధాన కారణమని చెప్పారు. ప్రపంచ రాజ్యాంగాల్లోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనదే అన్నారు. మన రాజ్యాంగంలో పొందుపర్చబడిన అంశాల ఆధారంగా రాజ్యాం గప రంగామనమంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జీవి స్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం అవసరమని, అలాగే ప్రజలకు కూడా రాజ్యాంగం యొక్క విలువలు, ఔన్నత్యాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు రాజేంద్రప్రసాద్ వంటి ఎందరో మహనీయులు దేశ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం రూపొందించిన భారత రాజ్యాంగాన్ని గౌరవించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జిల్లాస్థాయి అధికారుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ ఉదయభాస్కర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లుంబిని పాఠశాలలో 3 వందల అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ



**చేజర్ల నవంబర్ 26 ప్రభాతవార్త** మండలకేంద్రమైన చేజర్లలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక లుంబిని ప్రవేటు విద్యాలయం విద్యార్థులు 3 వందల అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుండి పలు వీధులలో ర్యాలీ సాగింది. పాఠశాల ఆవరణంలో అన్ని వీధుల్లో వందేమాతం నినాదాలతో మారుమోగాయి. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసినసమావేశంలో ఉపాధ్యాయులు, విద్యా ర్థులు ప్రార్థన నిర్వహించారు. అలాగే అంబే ద్కర్ రచించిన రాజ్యాంగం గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరెస్పాండెంట్ బి రమేష్,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన విజయన్

**నెల్లూరు, నవంబర్ 26, ప్రభాతవార్త -వైద్యం** నగరంలోని కరెంట్ ఆఫీసు సెంటర్‌లో ఉన్న విద్యుత్ భవన్లో 75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం 1949 వ సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగసభ ద్వారా ఆమోదించడం జరిగిందని తెలిపారు. భారతదేశం యొక్క రాజ్యాంగందేశం యొక్క పాలనను రూపొందించే పునాది అని తెలిపారు. భారతదేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగ రాజ్యాంగం స్థాపించిందని తెలి పారు. రాజ్యాంగం ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తుందని,సామాజిక ఆర్థికన్యాయాన్ని ప్రోత్సహించడంలో ప్రభుత్వానికి మార్గనిర్దేశం చేస్తుందని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవాన్ని సంవిధాన్ దివస్ అని కూడా పిలుస్తారని తెలి యజేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ ఎం.శ్రీధర్, అకౌంట్స్ ఆఫీసర్ ఏ.వి జిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అల్తాఫ్, పర్సనల్ ఆఫీసర్‌సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్న రాహుల్ గాంధీ



**నెల్లూరు, నవంబర్ 26, ప్రభాతవార్త-వైద్యం** దేశంలో బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ మా పార్టీపై గ్లోబ్ ప్రచారాన్ని చేస్తున్నాడని భారతీయ జనతా పార్టీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు ఆర్టీసీ నెల్లూరు రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలోని బీజేపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ మా పార్టీ సిద్ధాంతం ప్రకారం రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అందులో భాగంగానే నేడు రాజ్యాంగ దినోత్సవం ఇక్కడ జరుపుకోవడం జరిగిందన్నారు. ఈ దినోత్సవాన్ని మా పార్టీ ప్రతి ఏటా జరుపుకు టుందని అయితే రాహుల్ గాంధీ కావాలనే బీజేపీపై విష ప్రచారాన్ని చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంలోని చట్టాలను మార్చాలని ఆలోచన బీజేపీకి ఏనాడు లేదని, కావాలని బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత తీసుకొచ్చేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్లు మార్చేస్తున్నాడనడంలో ఏ మాత్రం నిజం లేదని , అది అవాస్తవం అని అన్నారు. గుజరాత్ హర్యాన ప్రజలు గుర్తించే అక్కడ మొన్న జరిగిన ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టడం జరిగిందన్నారు. వాజ్‌పేయి హయాం నుండి రిజర్వేషన్ బీజేపీ అమలు చేస్తుందని, అలాగే ఉద్యోగుల ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్ ని అమలు చేస్తుందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగానికి కట్టుబడి పాలన కొనసాగిస్తున్నాడని అన్నారు. బూత్ కమిటీ ఎన్నికలు ప్రారంభమయ్యాయని, ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలు కూడా ఆ కమిటీలలో అవకాశం కల్పిస్తున్నామన్నారు. డిసెంబర్ 1 నుండి డిసెంబర్ 15 లోపు ఎన్నికలు పూర్తవుతాయన్నారు. డిసెంబర్ 15 జిల్లా కమిటీలు కూడా పూర్తి అవుతాయన్నారు. జనవరి 10వ తేదీ లోపు రాష్ట్ర కమిటీ, జనవరి 15వ తేదీ తర్వాత ఆలిండియా అధ్యక్షుడు ఎన్నిక జరుగుతుందన్నారు. విజయవాడలో ఈనెల 31న సంఘటన పర్వ్‌కి సంబంధించిన వర్క్ షాపు కూడా జరుగుతుందని సురేష్‌రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కూడా ప్రతి సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తారన్నారు. కమ్యూనిస్టు పార్టీ కూడా సభ్యత్వం ఉందని అయితే ఆ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్మదని ప్రజాస్వామ్యాన్ని నమ్మి ఏకైక పార్టీ బీజేపీ పార్టీ అని అన్నారు. ఈశాన్య ప్రాంతాలైన మిజోరం, నాగాలాండ్, మేఘాలయలలో బీజేపీ బలహీనంగా ఉండేదని, నేడుసభ్యత్వ నమోదులో మా టార్గెట్లో 90 శాతం పూర్తి చేసి అద్భుతమైన ఫలితాలు వచ్చాయని, ఆ ప్రాంతంలో క్రిస్టియన్ డామినేషన్ ఎక్కువగా ఉన్నా బీజేపీకి పూర్తి మద్దతును అందజేస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోదీ చేస్తున్న పరిపాలనలతోనే నేడు అన్ని సామాజిక వర్గాల ప్రజలు బీజేపీ వైపు కి వస్తున్నారని, దీంతో కాంగ్రెస్‌కి శృంగభంగమైందని సురేష్ రెడ్డి వివరించారు. ఉప ఎన్నికలు 48 చోట్ల జరిగితే బీజేపీ దాని మిత్రపక్షాలు 26 చోట్ల గెలిస్తే కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాలకే పరిమితమైందని సన్నపురెడ్డి వెల్లడించారు. బీజేపీ అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్ళుగా చూస్తూ ప్రజలను అభ్యున్నతిలోకి తీసుకుపోవడమే మా పార్టీ ధ్యేమన్నారు. మా పార్టీ విజయాలకు ప్రధాన కారణం బూత్ కమిటీలను ఆయన ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి, వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరమ్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిబైరి శ్రీనివాసులు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్ యాదవ్, నమామి గంగే కన్వీనర్ మిదతల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం విజయ్ కుమార్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అశోక్ నాయుడు, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌ఛార్జీ ముక్కు రాధాకృష్ణ గౌడ్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గిరి కుమార్ గౌడ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి హర్ష, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, మదన్‌సాయిరెడ్డి, రాష్ట్ర ఓబీసీ మొత్తం సోషల్ మీడియాకో కన్వీనర్ సుధీర్, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

### - జలజీవన్ మిషన్ అక్రమాలపై విచారణ



**లింగసముద్రం, నవంబర్ 26, ప్రభాతవార్త** లింగసముద్రం మండలం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన సమీక్ష సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, ప్రజల సమస్యలను ముఖ్యంగా మండలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ మండలంలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో అనేక అక్రమాలు జరిగాయని వాటిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని వారు తిన్న అవినీతి సొమ్మును తిరిగి ప్రభుత్వానికి జమ చేసేలా చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు .ఈ మండలంలో గత ప్రభుత్వంలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని ముఖ్యంగా అసైన్‌మెంట్ భూములలో అవకతవకలు జరిగాయని అసైన్‌మెంట్ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని వాటిపై తిరిగి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత 2014-19 తెలుగుదేశం ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా చేశారని కాని గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు ప్రస్తుతం 15 వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా చెల్లించాలని వైసీపీ నాయకులు అధికారులు బెదిరించడం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గ్రామ స్థాయిలో తీసుకున్న తీర్మాణాలతో 15 కోట్ల రూపాయలతో నూతన సీసీ రోడ్ల పనులు మంజూరు చేశారని, రాబోయే రోజుల్లో అన్ని పంచాయతీల్లో సీసీ రోడ్లు వేసి ప్రజల సౌకర్యార్థం రోడ్ల సమస్య లేకుండా చూస్తారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని వృద్ధులకు, పెన్షన్లు పెంపు, వికలాంగులకు రూ.15వేలు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్, దీపం పథకంవంటి ఎన్నో పథకాలను అమలు చేశారని తెలిపారు. రాళ్లపాడు ఆయకట్టు రైతుల వరి పంటకు నీరు అందించే బాధ్యతను ఒక రైతు బిడ్డగా నేను తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతరం ఎమ్మెల్యేని విశ్వనాధపురం గ్రామ సర్పంచ్ బొల్లినేని నాగేశ్వరరావు, నాయకులు సోంపల్లి మనోహర్, రాజవరపు మాలకొండయ్య శాలువాతో సత్కరించారు. ఎంపీడీఓ కట్ట శ్రీనివాసరావు, ఎమ్మార్వో శ్రీనివాసులు, ఇతర మండల అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.